సాక్షి
కుమురం భీం

మంగళవారం । 30 । జులై । 2024



ప్రజల చెంతకే 'పోస్ట్'

తపాలా శాఖ ప్రమాద బీమా పథకాలను అమలులోకి తెచ్చింది. పోస్టల్ సిబ్బంది సమీప గ్రామాల్లోని ప్రజలకు బీమా పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. 10లో▸



వామ్మో.. ఇవేం రోడ్లు 11లో▸

భారీ వర్షాలకు జిల్లాలోని రోడ్లు అధ్వానంగా మారాయి. అధికారులు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించడం కష్టంగా మారింది.

గరిష్టం/కనిష్టం
32.0 /26.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అడ ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలంలోని కుమురంభీం (అడ) ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 243 మీటర్లు కాగా.. సోమవారం 237.35 మీటర్లు(5.60టీఎంసీలు)గా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 2438 క్యూసెక్కులు ఉండటంతో మూడు గేట్లు 0.45 మీటర్లు పైకెత్తి 3723 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.

తగ్గుముఖం పట్టిన వర్షం



ఆసిఫాబాద్: కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కాస్త తగ్గుముఖం పట్టింది. జిల్లా ప్రజలతోపాటు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. విస్తారమైన వర్షాలతో పత్తి చేలలో విపరీతమైన కలుపు పెరిగింది. వ్యవసాయ పనులు ముమ్మరం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వర్షం లేకపోవడంతో చాలా రోజుల తర్వాత జిల్లా కేంద్రంలోని మార్కెట్ కొనుగోలు దారులతో సందడిగా మారింది. సోమవారం జిల్లాలో 9.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కాగజ్‌నగర్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు సోమవారం సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను కలిసి వినతిపత్రం అందించారు. బెల్లంపల్లిలో జరిగిన సింగరేణి పరిరక్షణ యాత్రలో పాల్గొన్న ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. బకాయి పడిన పీఎఫ్ సుమారు రూ.రెండు కోట్లతోపాటు వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, సంజీవ్, శంకరమ్మ, రమేశ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో సందల్ ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో సోమవారం తాజుద్దీన్ బాబా సందల్ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పాల్గొని పూజలు చేశారు. పట్టణంలోని పలు వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. భక్తులు మొక్కులు చెల్లించారు.

కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీల పంపిణీ



కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందిస్తున్న గని మేనేజర్ ప్రవీణ్ పాటింగ్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో సోమవారం గని మేనేజర్ ప్రవీణ్ పాటింగ్ కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ వివరాలను తెలియజేసేందుకు యాజమాన్యం పీఎఫ్ చిట్టీలు అందిస్తుందన్నారు. కార్మికులకు 2023 మార్చి 31 వరకు సీఎంపీఎఫ్ నిల్వల వివరాలకు సంబంధించిన చిట్టీలను అందిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించి సీఎంపీఎఫ్ ఖాతాల్లో ఉన్న నిల్వలతో పాటు ప్రతి నెలా జమవుతున్న మొత్తాల వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. చిట్టీల్లో ఏవైనా తప్పులు ఉంటే యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అధికారి నాగుల వేణు, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జుపాక రాజేశ్, షిఫ్ట్ ఇన్‌చార్జి అంజన్న, ఎండీ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

సంతలు.. చింతలు!



కౌటాల మండల కేంద్రంలో ప్రతీ సోమవారం సంత నిర్వహిస్తారు. ఇటీవల వేలం ద్వారా పంచాయతీకి రూ.4.20 లక్షల ఆదాయం సమకూరింది. ఇక్కడ స్థలం కబ్జాకు గురికావడం, అక్రమ నిర్మాణాలతో సంత స్థలం ఇరుకుగా మారింది. వినియోగదారులు, వ్యాపారులకు మూత్రశాలలు లేవు. రోడ్డుపై అమ్మకాలు సాగిస్తుండటంతో కౌటాల– కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.



కౌటాల– కాగజ్‌నగర్ ప్రధాన రహదారికి ఇరువైపులా కూరగాయల విక్రయాలు



దహెగాం మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం సంత నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇప్పటివరకు వారసంత వేలం జరగలేదు. వ్యాపారులకు షెడ్లు అందుబాటులో లేక రోడ్లపైనే కూరగాయలు, సరుకులు అమ్ముతున్నారు. ఇటీవల వర్షానికి సంతలో భారీగా వరద నిలిచింది. వ్యాపారులతోపాటు వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. చిన్నపాటి వర్షం కురిసిన సంత మొత్తం నడవలేకుండా బురదమయంగా మారుతుంది. ఇలా జిల్లాలోని ప్రధాన సంతల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి.

- ఆదాయం వస్తున్నా సౌకర్యాలు నిల్
- స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టింపు కరువు
- రోడ్లపైనే కొనసాగుతున్న క్రయవిక్రయాలు
- వసతుల కల్పనపై దృష్టి సారించని అధికార యంత్రాంగం

కౌటాల(సిర్పూర్): గ్రామీణ ప్రజల అవసరాలకు.. వారానికోసారి సరిపడా సరుకులు, కూరగాయలు కొనుగోలు కోసం సంతలపై ఆధారపడుతుంటారు. పల్లెలు, మండల కేంద్రాల్లో నిర్వహించే వార సంతలు సామాన్యులకు మినీ మార్కెట్లుగా ఉంటున్నాయి. పంచాయతీలకు ఆదాయ వనరులుగా నిలుస్తున్నాయి. అయితే వారసంతల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. చాలాచోట్ల ప్రత్యేక స్థలాలు, షెడ్లు లేక రోడ్లకు ఇరువైపులా తాత్కాలిక డేరాలు వేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. వ్యాపారుల నుంచి పన్నులు వసూలు చేస్తున్నా కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి వసతులు కల్పించలేని దుస్థితి.

భారీగా ఆదాయం..

గత మార్చిలోనే సంతల నిర్వహణకు వేలం పాట నిర్వహించాల్సి ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జూన్, జూలై నెలల్లో జిల్లాలోని కొన్ని వార సంతలకు పంచాయతీ అధికారులు వేలం నిర్వహించారు. మరికొన్ని వార సంతలకు వేలం త్వరలో నిర్వహించనున్నారు. ఏటా పన్నులు, పన్నేతర ఆదాయం ద్వారా సుమారు రూ.6 కోట్ల పైగా ఆదాయం వస్తుంది. ఇటీవల నిర్వహించిన వేలం ద్వారా కౌటాల వారసంతకు రూ. 4.20 లక్షలు, చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్ సంతకు రూ.3.48 లక్షలు, బెజ్జూర్ సంతకు రూ.2.20 లక్షలు, కెరమెరి వారసంతకు రూ.1.87 లక్షల ఆదాయం వచ్చింది. కొన్ని సంతల నిర్వహణ గడువు ముగిసినా వివిధ కారణాలతో ఇప్పటివరకు వేలం నిర్వహించలేదు.

వర్షాలకు బురదమయం

ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రత్యేకంగా షెడ్లు లేని కారణంగా వారసంతల పరిసరాలు బురదమయంగా మారుతున్నాయి. రోడ్డుపై కూరగాయలు, వస్తువులు అమ్మే వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మహిళల కోసం ఎక్కడా మూత్రశాలలు లేవు. వారాంతపు సంతలు జరిగే గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులు వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. కానీ దీనిపై పంచాయతీ అధికారులకు పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో పనులు చేపట్టడం లేదు. కాగా.. వారసంతల్లో సమస్యలు, నిర్వహణ, నిధులపై జిల్లా పంచాయతీ అధికారులను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా వారు స్పందించలేదు. వారసంతల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడడంతోపాటు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

ఆక్రమణకు గురవుతున్న స్థలాలు

జిల్లాలోని 15 మండల కేంద్రాల్లో వార సంతలు కొనసాగుతుండగా.. పలు మేజర్ పంచాయతీల్లోనూ వార సంతలు నిర్వహిస్తున్నారు. సంతలో నిర్వహణలో పంచాయతీలకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రముఖ ప్రాతపోషించే సంత నిర్వహణకు స్థలం లేక ఇబ్బందిగా మారింది. అధికారుల పర్యవేక్షణ కొరవడి కౌటాల, రవీంద్రనగర్, సిర్పూర్(టి), బెజ్జూర్ మండలాల్లో వారసంత స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. స్థలం సరిపోక కొందరు వ్యాపారులు రోడ్ల పక్కన, దుకాణాల ఎదుట క్రయవిక్రయాలు జరుపుతున్నారు. కొందరు దుకాణాల యజమానులు కూరగాయల వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. మరోవైపు సంత నిర్వహణను దక్కించుకున్న గుత్తేదారు కూడా వసూలు చేస్తున్నాడు. దీంతో కూరగాయల వ్యాపారులు దోపిడీకి గురవుతున్నారు.

ప్రతీ సోమవారం ట్రాఫిక్



కౌటాల వారసంతకు స్థానికులతోపాటు బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాల నుంచి వ్యాపారులు, వినియోగదారులు వస్తుంటారు. ఇక్కడ స్థలం ఆక్రమణకు గురికావడంతో స్థలం సరిపోవడంలేదు. చిరువ్యాపారులు రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రతీ సోమవారం కౌటాలలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది.

– వనజ, యాపలగూడ, మం.కౌటాల

వీధి కుక్కలు, పశువులు



కౌటాల వారసంతలో పశువులు, వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. ఇరుకు స్థలంలో జనాలను మూగజీవాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఏటా పంచాయతీకి రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా కనీసం మూత్రశాల ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించాలి.

– అశోక్, గురుడుపేట

నేటి నుంచి రెండో విడత మాఫీ

- రూ.లక్షన్నర లోపు రుణాలు మాఫీకి సర్వం సిద్ధం
- జిల్లాలో 14,623 మంది ఖాతాల్లో రూ.153.34 కోట్ల నగదు జమ



ఆసిఫాబాద్: రైతు రుణమాఫీ ప్రక్రియలో భాగంగా మంగళవారం నుంచి రెండో విడత అమలు చేయనున్నారు. రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర లోపు రుణాలు తీసుకున్న రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. తొలివిడత రుణమాఫీలో భాగంగా ఇప్పటికే ఈ నెల 18 నుంచి రూ.లక్ష వరకు రుణాల మాఫీ ప్రక్రియ ప్రారంభించారు. 22 వేల మంది రైతుల ఖాతాల్లో రూ.125.20 కోట్ల నగదు జమ చేస్తున్నారు. ఇక రెండో విడతలో భాగంగా జిల్లాలో రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రుణమాఫీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రెండోవిడత రుణమాఫీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సీఎం సమావేశం నిర్వహించనున్నారు.

14,623 మంది ఖాతాల్లోకి..

జిల్లాలో 1.38 లక్షల మంది రైతులుండగా సుమారు 1.19 లక్షల మంది పంట రుణాలు తీసుకున్నారు. వీరిలో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారు 22 వేల మంది ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. రెండో విడతలో భాగంగా జిల్లావ్యాప్తంగా 14,623 మంది రైతుల ఖాతాల్లో రూ.153,34,94,379 జమ కానున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో వెల్లడించారు. డిసెంబర్ 12 2018 నుంచి మంజూరైన తర్వాత రెన్యువల్ అయిన రుణాలకు డిసెంబర్ 09 2023 వరకు ఉన్న బకాయి రుణాలకు మాఫీ వర్తిస్తుంది. కాగా.. తొలివిడతలో అర్హులైన కొంతమంది ఖాతాల్లో రుణ మాఫీ నగదు జమ కాలేదని రైతులు వాపోతున్నారు.

పులుల రక్షణ అందరి బాధ్యత

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని పెద్దపులుల రక్షణ అందరి బాధ్యత అని డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా సోమవారం అటవీశాఖ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పులుల సంరక్షణతోనే వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. పోడు భూముల సాగుతో జిల్లాలో అటవీ విస్తీర్ణం తగ్గి పులుల మనుగడ కష్టంగా మారిందన్నారు. గతంతో పోలిస్తే పులుల సంచారం పెరిగిందన్నారు. అడవులను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు వెదురు వస్తువుల తయారీపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు సరోజారాణి, రాజేశ్వరచారి, సెక్షన్ అధికారులు పరండె సాయి, లక్ష్మణ్, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

శాంతించని పెన్‌గంగ



అంతర్రాష్ట్ర వంతెన వద్ద పెన్‌గంగ ఉధృతి

సిర్పూర్(టి): మహారాష్ట్ర గత పదిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగ ప్రవాహ ఉధృతి తగ్గడం లేదు. నది పరీవాహక ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ముఖ్యంగా సిర్పూర్(టి) మండలంలోని మాకిడి, జక్కాపూర్, హుడ్కిలి, నవేగాం, వెంకట్రావ్‌పేట్, టోంకిని, పారిగాం, లోనవెల్లి గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెన్‌గంగతోపాటు టోంకిని సమీపంలోని మద్దెల వాగు, తాటి చెట్టు ఒర్రె, చింతకుంట వాగు, భూపాలపట్నం జీడి వాగు, హుడ్కిలి వాగు, పారిగాం వాగు, చీలపెల్లి రెండు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చీలపెల్లి గ్రామానికి రెండురోజులపాటు రాకపోకలు నిలిచిపోయాయి. వెంకట్రావ్‌పేట్– పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిలోని అంతర్రాష్ట్ర వంతెన వద్ద పెన్‌గంగ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మూడు రోజుల నుంచి వంతెన పైనుంచి పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్యలు ఉన్నా సమాచారం అందించాలని అధికారులు కోరారు.

వరద నీటిలోనే పంటలు

పెన్‌గంగ నదితోపాటు పరీవాహక ప్రాంతాల్లోని హుడ్కిలి వాగు, టోంకిని మద్దెల వాగు, తాటి చెట్టు ఒర్రె, పారిగాం వాగుల ప్రవాహంతో సమీపంలో పంటలు నీట మునిగాయి. నాలుగు రోజులుగా వరద నీటిలోనే ఉన్నాయి. పత్తి, మిరప పంటలు దెబ్బతినడంతో రైతులు నష్టపోతున్నారు. ఇప్పటివరకు వ్యవసాయశాఖ అధికారులు ఎలాంటి సర్వే నిర్వహించలేదని రైతులు చెబుతున్నారు. నష్టం వివరాలు సేకరించడం లేదని పేర్కొంటున్నారు. సాధారణ బదిలీల్లో నిమగ్నమై ఉండటంతో క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువైంది. కాగా.. మూడు వేల ఎకరాల్లో పత్తితోపాటు మిరప పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది.



వరదనీటిలో మునిగిన పత్తి పంట

అసెంబ్లీలో తీర్మానానికి సిద్ధమా..!

- సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో ధర్నా చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సవాల్
- సింగరేణి పరిరక్షణకు బస్సుయాత్ర ప్రారంభం



జెండా ఊపి బస్సుయాత్రను ప్రారంభిస్తున్న వీరభద్రం, నాయకులు

బెల్లంపల్లి: సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానించి ఢిల్లీలో ధర్నా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందా అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సవాల్ విసిరారు. సోమవారం సింగరేణి పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రను బెల్లంపల్లిలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంటా చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో వీరభద్రం మాట్లాడారు. సింగరేణి సంస్థలో 51శాతం వాటా కలిగిన రాష్ట్ర ప్రభుత్వం, 49శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు వ్యతిరేకమంటూనే చాపకింద నీరులాగా బొగ్గు సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కుయుక్తులు పన్నుతున్నాయని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తనకు అంత్యత సన్నిహితుడైన అదానికి దేశంలోని కోలిండియా, సింగరేణి సంస్థల్లోని బొగ్గు బ్లాక్‌లను అప్పగించడానికి పావులు కదుపుతున్నారని ఆరోపించారు. ప్రైవేటీకరణపై సీఎం రేవంత్ రెడ్డి ద్వంద్వ విధానాలు అవలంబిస్తున్నారని అన్నారు. శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాక్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వేలం పాట నిర్వహిస్తే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క పాల్గొనడం వెనుక మర్మమేంటో సమాధానం చెప్పాలని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల చీకటి ఒప్పందాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు, ఇతర వర్గాల శ్రేణులు పోరాటంలో కలిసి రావాలని కోరారు. అంతకుముందు బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, భూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు సాయిబాబు, పైళ్ల ఆశయ్య, సీఐటీయూ సింగరేణి విభాగం డెప్యూటీ కార్యదర్శి నాగరాజ్ గోపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ప్రకాశ్, నాయకులు రాజన్న, శ్రీనివాస్, రమణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణికే కేటాయించాలి

మందమర్రిరూరల్: రాష్ట్రంలోని నూతన బొగ్గు గనులను సింగరేణికి కేటాయించి సంస్థను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. సోమవారం బస్సుయాత్ర మందమర్రికి చేరుకోగా.. ఏరియాలోని కేకే–5గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన బొగ్గు గనులు వస్తేనే సింగరేణికి భవిష్యత్ ఉందని తెలిపారు. అనంతరం మార్కెట్, పలు వీధుల గుండా బస్సుయాత్ర సాగింది.

ఐక్యంగా ఉద్యమించాలి

రామకృష్ణాపూర్: ప్రైవేటీకరణ బారి నుంచి సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు అన్ని రాజకీయ పక్షాలు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. బస్సుయాత్ర సోమవారం సాయంత్రం ఆర్‌కేపీకి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పరిరక్షణకు చేపట్టిన బస్సుయాత్రకు అన్ని వర్గాల ప్రజలు మద్దతునివ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్, ఆశన్న, శంకర్, రవి, వెంకట స్వామి, శ్రీనివాస్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

చింతలమానెపల్లి(సిర్పూర్): వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, జిల్లా నాయకుడు పాల్వాయి సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని దిందా గ్రామం శివారులోని వరదలకు దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. భారీ వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగి బూరెపల్లి, రణవెల్లి, కోర్సిని, దిందా, గూడెం, చిత్తాం, కోయపెల్లి, బూరుగూడ గ్రామాల శివారులోని సుమారుగా ఐదు వేలకు పైగా ఎకరాలలో పంట నష్టం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ. 20వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించకపోవడం సరికాదనారు. అలాగే తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం సానుకూలంగా ప్రకటన చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కోసం ఎమ్మెల్యే హరీశ్‌బాబు చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్ములె మల్లయ్య, చౌదరి నవీన్, రామన్న, గాదెనబోయిన వెంకటేశ్, కొంపరి బాలాజీ, సాత్పుతె తుకారాం, డగె అంకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

క్లుప్తంగా

మద్యానికి బానిసై వ్యక్తి మృతి


బండ మల్లేశ్ (ఫైల్)

దహెగాం: మండల కేంద్రానికి చెందిన బండ మల్లేష్(33) మద్యానికి బానిసగా మారి ఆరోగ్యం క్షీణించి మృతిచెందాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేష్ భార్య మరొకరితో వివాహేతర సంబంధం కారణంగా ఏడాదిపాటు విడివిడిగా ఉన్నారు. కుటుంబ సభ్యులు పంచాయితీ నిర్వహించి ఇద్దరిని కలిపారు. ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో మల్లేష్ మద్యానికి బానిసగా మారాడు. ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం సాయంత్రం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మల్లేష్ భార్యపై అనుమానాలు ఉన్నాయని, ఆమెపై చర్యలు తీసుకోవాలని మృతుడి సోదరుడు సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

నీటి గుంతలో పడి బాలుడు మృతి


షిఫాన్ అలీ మృతదేహం

బెజ్జూర్: నీటి గుంతలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన షిఫాన్ అలీ (6) సోమవారం సాయంత్రం ఆడుకుంటూ వెళ్లి నీటి గుంతలో పడిపోయాడు. మృతుని తండ్రి యూసుఫ్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు యువతి మృతి


సాధన (ఫైల్)

మందమర్రిరూరల్: పాముకాటుకు యువతి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని రెండవ జోన్ లయోల స్కూల్ సమీపంలో నివసించే సాధన (22)సోమవారం మధ్యాహ్నం ఇంట్లో పడుకుని లేచే క్రమంలో పాముకాటుకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు పట్టణంలోని పీహెచ్‌సీకి తరలించగా ఆస్పత్రి మూసి ఉండడంతో మంచిర్యాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజల చెంతకే 'పోస్ట్'

- తపాలా కార్యాలయాల్లో అన్ని సేవలు
- ప్రతీ పంచాయతీలో బ్రాంచులు
- బ్యాంకులను మించి సేవలు
- పింఛన్, కరువు డబ్బులే అనుకుంటున్న గ్రామీణులు
- ఇక్కడ పొదుపుచేస్తే అధిక వడ్డీలు
- టర్మ్‌పాలసీలతో కుటుంబాలకు అండ


ఈ ఫొటోలో చెక్కు అందుకుంటున్న మహిళ పేరు అల్లకుంట మౌనిక. నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) మండలం రాంపూర్‌కు చెందిన మౌనిక భర్త శ్రీనివాస్ పోస్ట్ ఆఫీస్‌లో రెండేళ్ల క్రితం టర్మ్ పాలసీ తీసుకున్నాడు. గతేడాది గుండంపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో శ్రీనివాస్ మృతి చెందాడు. దీంతో పోస్టల్ అధికారులు మౌనికకు టర్మ్‌పాలసీ కింద మంజూరైన రూ.10 లక్షల బీమా చెక్కును అందజేశారు.

భైంసా/దండేపల్లి: దేశంలోనే అతి పెద్ద నెట్‌వర్క్‌గా పనిచేస్తున్న పోస్టల్ శాఖ నాలుగైదేళ్లుగా అనేక పథకాలను ప్రవేశపెట్టింది. రోడ్డు ప్రమాదాలు, అనుకోకుండా జరిగే ప్రమాద ఘటనల్లో చాలా మంది జీవితాలు అర్ధాంతరంగా ముగుస్తున్నాయి. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు మరణిస్తే ఆకుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వాలు కొన్ని ప్రమాద బీమా పథకాలను అమలులోకి తెచ్చాయి. వాటిల్లో తపాల ప్రమాద బీమా పథకాలు ఉన్నాయి. అందులో రూ.10 లక్షలు, రూ.15 లక్షలు పరిహారంగా అందిస్తున్నాయి. తపాల బీమా పథకాలపై 'సాక్షి' అందిస్తున్న కథనం.

పథకాలపై అవగాహన

పోస్టల్ శాఖ ప్రవేశపెడుతున్న పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తాజాగా డాక్‌చౌపాల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఏర్పాటు చేయనున్నారు. పోస్టల్ సిబ్బంది గ్రామగ్రామానికి వెళ్లి పోస్టాఫీసులో అందుబాటులో ఉండే సేవలను ప్రజలకు వివరించనున్నారు. వారితో ఖాతాలు తీయించి పొదుపు చేసేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు.

బీమాకు ఎవరు అర్హులు?

తపాల ప్రమాద బీమా తీసుకునేందుకు 18 నుంచి 65 ఏళ్ల వయస్సు వారు అర్హులు, ఆధార్ కార్డుతో తపాల కార్యాలయానికి వెళ్లి రూ.200 చెల్లించి ఖాతా తెరవాలి. రూ.549 లేదా 749తో బీమా చేసుకోవచ్చు. ఇది ఏడాదిలో ఒక్కసారి మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. రూ.549 చెల్లిస్తే రూ.10 లక్షలు, రూ.749 చెల్లిస్తే రూ.15 లక్షల ప్రమాద బీమా డబ్బులు బాధిత కుటుంబానికి అందుతాయి. రోడ్డు ప్రమాదాల్లో చికిత్స పొందితే రూ. 60వేల వరకు ఆసుపత్రి బిల్లులు పొందవచ్చు. ప్రమాదవశాత్తు ఎముకలు విరిగితే రూ.లక్ష వరకు బిల్లులు పొందవచ్చు. ఈ టర్మ్‌పాలసీలు చాలా మందికి తెలియక నష్టపోతున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	నియోజకవర్గాలు	మండలాలు	సబ్ పోస్టాఫీసులు	బ్రాంచ్ పోస్టాఫీసులు
ఆదిలాబాద్	ఆదిలాబాద్, బోథ్	18	14	106
నిర్మల్	ఖానాపూర్, ముధోల్, నిర్మల్	19	15	117
మంచిర్యాల	మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్	18	24	141
కుమురంభీం	ఆసిఫాబాద్, సిర్పూర్	15	9	100

క్షణాల్లో సేవలు అందిస్తాం



పోస్టాఫీసుల్లో అన్ని రకాల సేవలు అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉంటారు. పోస్టాఫీసుల్లో అనేక పథకాలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఉపాధి హామీ, ఆసరా పింఛన్ డబ్బులే కాకుండా అనేక సేవలు అందుతాయి. ప్రజలంతా పోస్టాఫీసుకు వెళ్లి అవసరం ఉన్న ఖాతాలు తెరిచి పొదుపు చేసుకోవాలని కోరుతున్నాం. ఊరూరా సుఖన్య సమృద్ధి యోజన పథకాలు చేయిస్తున్నారు. బీమా పాలసీలు, వెహికిల్ ఇన్సూరెన్స్ పొందవచ్చు.

– జే.దిలీప్‌కుమార్, సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్టాఫీసేస్, భైంసా

మరిన్ని పథకాలు...

- బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ ఏటీఎం, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలు అందించే సేవింగ్ బ్యాంక్ పథకం (ఎస్‌బీ)
- స్వల్ప కాలిక అవసరాల కోసం నెలనెలా పొదుపు చేసుకునే రికరింగ్ డిపాజిట్ పథకం (ఆర్‌డీ)
- ఆడపిల్లల బంగారు భవిష్యత్‌కోసం సుకన్య సమృద్ధి యోజన పథకం (ఎస్ఎస్‌వై)
- అబ్బాయిల ఉన్నత చదువులకు, ఇతర అవసరాలకు అందరికీ ఉపయోగపడే పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) పథకం
- ఒకటి నుంచి ఐదు సంవత్సరాల కాలపరిమితితో ఎక్కువ వడ్డీ అందించే టైం డిపాజిట్ పథకం (టీడీ)
- రిటైర్డ్ ఉద్యోగులకు, 60 సంవత్సరాలు దాటిన వారికి ఎక్కువ వడ్డీ రేటుతో మూడు నెలలకు ఒకసారి వడ్డీ అందించే సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీం పథకం (ఎస్‌సీఎస్ఎస్)
- నెలనెలా వడ్డీ పొందాలనుకునే వారికోసం మంత్లీ ఇన్కమ్ స్కీమ్ (ఎంఐఎస్)
- మహిళల సాధికారత కోసం రెండు సంవత్సరాల కాల పరిమితితో ఎక్కువ వడ్డీ అందించే మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ)
- ఆదాయ పన్ను సడలింపు కోసం తీసుకునే నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం (ఎన్ఎస్‌సీ)
- నగదును రెట్టింపు చేసే కిసాన్ వికాస్ పత్ర పథకం (కేవీపీ)
- బీమా రంగంలో అతి తక్కువ ప్రీమియంతో అత్యధిక బోనస్‌తో కుటుంబ సభ్యులకు సంపూర్ణ భద్రత కల్పించే పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, గ్రామీణ తపాల జీవిత బీమా (పీఎల్ఐ,ఆర్‌పీఎల్ఐ)
- ఆధార్ అనుసంధానంతో ఖాతా కలిగి ఉన్న బ్యాంకు నుండి నగదు విత్ డ్రా చేసుకోవడానికి ఆధార్ ఎనబెల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) సౌకర్యం కలదు
- అతి తక్కువ ప్రీమియంతో రూ.550 నుంచి రూ.755 చెల్లిస్తే రూ.10 నుంచి రూ.15 లక్షల ప్రమాద బీమా కల్పించే పాలసీలు
- వెహికల్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్, టర్మ్ పాలసీ సేవలు, అన్ని రకాల లెటర్, పార్సిల్ బుకింగ్ సేవలు, స్పీడ్ పోస్ట్ బుకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయి.

సర్టిఫికెట్లు అందజేత


సర్టిఫికెట్ అందజేస్తున్న రాధాకుమారి

శ్రీరాంపూర్: సింగరేణి సేవాసమితి ద్వారా పలు వృత్తి కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 252 మంది మహిళలకు ఖాదీ గ్రామోద్యోగ్ వారు అందించిన సర్టిఫికెట్లను ఆమె ప్రదానం చేశారు. అనంతరం ఢిల్లీ వరద ప్రమాదంలో మృతి చెందిన ఎస్సార్పీ1 గని మేనేజర్ విజయకుమార్ కుమార్తె తన్యా సోనికి సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం సంజీవరెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, సేవా సెక్రటరీ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కొడుకు కాటికి... తల్లిదండ్రులు జైలుకు


శేఖర్ (ఫైల్)

నెన్నెల: మండల కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన అబ్బర్ల విజయ్, పద్మ దంపతులు నాటసారాకు బానిసయ్యారు. నాలుగు రోజుల క్రితం మద్యం మత్తులో ఇంట్లో నిద్రిస్తున్న కుమారుడు శేఖర్ (24)పై కొడవలితో దాడి చేసి గాయపరిచారు. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు జైలుకు వెళ్లగా కుమారుడు కాటికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అందరితో కలివిడిగా ఉండే శేఖర్ మృతితో పోచమ్మ వాడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సింగరేణి ఏరియా ఆస్పత్రిని కాపాడాలి


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: సింగరేణి ఏరియా ఆస్పత్రి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్మిక సంఘాలతో ఏర్పడిన బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి పరిరక్షణ సమితి నాయకులు సోమవారం జీఎం రవిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలం నుంచి ఏరియా ఆస్పత్రి పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, సరిపడా వైద్యులు, నర్సులు, వార్డుబాయ్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్కావెంజర్లను నియమించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. వార్డులను అనవసరంగా మూసివేసి కార్మికులు, కుటుంబ సభ్యులకు వైద్యసేవలను దూరం చేస్తున్నారన్నారు. మూసివేతకు గురైన మేల్, ఫిమేల్ వార్డులను పునఃప్రారంభించాలని, రిటైర్డు అయిన ఉద్యోగుల స్థానంలో కొత్త వారిని భర్తీ చేయాలన్నారు. సిబ్బందికి క్వార్టర్లను కేటాయించి ఫార్మసి, మెడికల్ స్టోర్‌ను తెరవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దంశెట్టి రాజమొగిలి, చిప్ప నర్సయ్య, గెల్లి జయరాం, ఎస్.తిరుపతి, మణిరాం సింగ్, ఎండీ చాంద్‌పాషా, ఓజియార్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట మోసగించిన ఇద్దరి అరెస్టు


నిందితులను చూపిస్తున్న సీఐ బన్సీలాల్

మంచిర్యాలక్రైం: సింగరేణిలో ఉద్యోగం పెట్టిస్తానని మాయ మాటలు చెప్పి లక్షలు దండుకుని ఉడాయించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాలకు చెందిన బేర నగేష్ కుమార్ భార్యకు సింగరేణిలో ఉద్యోగం పెట్టిస్తానని సోమగూడెంకు చెందిన సింగరేణి ఉద్యోగి విష్ణు ప్రసాద్ రూ.15 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. వరంగల్‌కు చెందిన ఒక అధికారి దాసు హరికిషన్ తనకు బాగా తెలుసని నమ్మించాడు. మొదటిసారిగా రూ.5 లక్షలు ఇవ్వాలని చెప్పడంతో విష్ణు ప్రసాద్ ద్వారా హరికిషన్‌కు 2022లో రూ.5 లక్షలు అప్పగించాడు. అప్పటినుంచి విష్ణుప్రసాద్ కాలయాపన చేస్తూ వచ్చాడు. చివరికి హరికిషన్ పారిపోయాడని చెప్పి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో నగేష్ కుమార్ ఈనెల 22న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విష్ణుప్రసాద్, హరికిషన్‌లను అరెస్టు చేశారు.

ఆర్మీ ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్య


తిరుపతి (ఫైల్)

లక్సెట్టిపేట: ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని గోదావరిరోడ్ రాంనగర్‌కు చెందిన గాదవేని తిరుపతి (25) ఇంటర్ పూర్తి చేశాడు. అతని సోదరుడు ఆర్మీలో ఉద్యోగం చేస్తుండగా తానుకూడా ఆర్మీలో ఉద్యోగం చేయాలని పలుమార్లు ప్రయత్నాలు చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. ఆర్మీ ఉద్యోగం రాలేదని తరచూ కుటుంబ సభ్యులతో చెప్పుకుంటూ బాధపడేవాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు ఎంతపిలిచినా పలుకకపోవడంతో తలుపులు పగులగొట్టి చూడగా ఉరేసుకుని కనిపించాడు. మృతుని తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాణహితకు పోటెత్తిన వరద


ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది

వేమనపల్లి: ఎగువన పెన్‌గంగ, వార్దా నదుల నుంచి వరద వస్తుండటంతో ప్రాణహిత నది మళ్లీ వరద పోటెత్తి ప్రవహిస్తోంది. వేమనపల్లి పుష్కరఘాట్ మునిగిపోగా సుంపుటం అట్టలొర్రె రహదారి సమీపం వరకు వరద ఆవరించింది. ప్రాణహిత వరద మూడోసారి పంటలను ముంచెత్తే ప్రమాదం నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుష్కరఘాట్ వద్ద అత్యవసరమైతేనే మహారాష్ట్ర-తెలంగాణకు పడవలతో రాకపోకలు సాగిస్తున్నారు.

రాంనగర్‌లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో నివాసం ఉంటున్న రవీంద్ర గౌడ్ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రవీంద్ర గౌడ్ ఇంటికి మరమ్మతులు చేయిస్తుండగా ఇదే క్రమంలో అదే కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో భద్రపర్చిన తులం బంగారం, రూ.5వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లాకు చెందిన చిన్నారి జాతీయస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచింది. జిల్లా కేంద్రానికి చెందిన పడిగెల భారతి, అశోక్ దంపతుల కుమార్తె కీర్తిశ్రీ మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో 'డ్యాన్స్ కా భూకంప్' పేరిట ఆదివారం నిర్వహించిన నృత్యపోటీల్లో శాస్త్రీయనృత్యం ప్రదర్శించి ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి దాదాపు 600 మందికి పైగా ఈ పోటీల్లో పాల్గొన్నారు.

క్రీడలపై యాజమాన్యం నిర్లక్ష్యం

శ్రీరాంపూర్: క్రీడలపై సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదాలు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కోలిండియాలో వార్షిక క్రీడల షెడ్యూల్ విడుదల చేశారని, అందులో పాల్గొనేందుకు సింగరేణి కూడా క్రీడా షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉండగా యాజమాన్యం పట్టించుకోవడంలేదన్నారు. క్రీడాకారులు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే క్రీడా షెడ్యూల్ విడుదల చేసి పోటీల కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.

పచ్చదనం పెంచాలి


సీహెచ్‌పీలో మొక్క నాటుతున్న జీఎం

శ్రీరాంపూర్: పచ్చదనాన్ని పెంచాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సూచించారు. సోమవారం సింగరేణి సీఎండీ బలరాం నాయక్ పుట్టినరోజును పురస్కరించుకుని శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో బలరాం నాయక్ 18 వేల మొక్కలను స్వయంగా నాటారన్నారు. ప్రతీ ఉద్యోగి, అధికారి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వారి నివాసాలు, కార్యాలయాల వద్ద మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజెంట్ ఏవీరెడ్డి, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, ఆర్కే 5 గని ఇన్‌చార్జి మేనేజర్ శివయ్య, అధికారులు చంద్రలింగం, పిట్ సెక్రటరీ నల్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

వరద దాటి.. విధులకు హాజరై


వరద దాటుతున్న హెల్త్ వర్కర్ స్వప్న

చింతలమానెపల్లి(సిర్పూర్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం దిందా గ్రామ సమీపంలోని వాగులో వరద ఉధృతి తగ్గడం లేదు. వర్షం కాస్త తగ్గుముఖం పట్టడంతో గ్రామస్తులు ప్రమాదకరంగానే వాగు దాటుతున్నారు. దిందా ఆరోగ్య ఉపకేంద్రంలో మిడ్ లెవల్ హెల్త్ వర్కర్‌గా పని చేస్తున్న జుమిడి స్వప్న సోమవారం ఉదయం నడుము లోతు వరదలోనే వాగు దాటింది. గ్రామస్తులు కొంత మంది సహకరించడంతోనే వాగు దాటి విధులకు వెళ్లినట్లు స్వప్న తెలిపింది.

పెద్దవాగులో అరుదైన చేప



బెజ్జూర్(సిర్పూర్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం తలాయి గ్రామం సమీపంలో పెద్దవాగులో ఓ వింత చేప లభ్యమైంది. పనెం శంకర్ చేపలు పట్టేందుకు వెళ్లగా.. అతడికి ఈ చేప దొరికింది. నల్లమచ్చలతో ఆకారం వింతగా ఉండటంతో చేపను చూసేందుకు స్థానికులు తరలివచ్చారు. ఈ విషయమై జిల్లా మత్స్యశాఖ ఫీల్డ్ అధికారి మధుకర్‌ను సంప్రదించగా.. ఈ చేపను డెవిల్ ఫిష్ అంటారని తెలిపారు. ఎక్కువగా ప్రాణహిత జలాల్లో సంచరిస్తుందని పేర్కొన్నారు. అయితే జిల్లాలో ఇప్పటివరకు జాలర్లకు దొరికిన ఘటనలు లేవని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ వైపు జలాల్లో ఎక్కువగా వీటి సంచారం ఉంటుందని, ఈ చేపలు తినేందుకు పనికి రావని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి


వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ శ్రేణులు

బెల్లంపల్లి: ఆటో కార్మికులు, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కె.రాంకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీకాంత్ సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. సింగరేణి పరిరక్షణ కోసం చేపట్టిన బస్సుయాత్ర ప్రారంభించడానికి బెల్లంపల్లికి వచ్చిన తమ్మినేనికి ఆయా సంఘాల నాయకులు వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన 7 నెలల కాలంలో 52 మంది ఆటో కార్మికులు మృతి చెందారని, ఆటో కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. విద్యారంగంలో అనేక సమస్యలు ఉన్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అనేక విద్యాసంస్థలకు పక్కాభవనాలు లేవన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, కాస్మోటిక్ చార్జీలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వివరించారు. విద్యారంగానికి గరిష్ఠంగా 30 శాతం నిధులు కేటాయించేలా సీపీఎం పార్టీ తరపున ప్రభుత్వంపై వొత్తిడి తీసుకు రావాలని విన్నవించారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి
- జెడ్పీలో ఘనంగా గురువందనం

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, గురువులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. వ్యాస పౌర్ణమిని పురస్కరించుకుని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో గురువందనం కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువులపై ఉన్న చిన్నచూపు పోగొట్టేలా వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2.91 లక్షల కోట్ల నిధులు కేటాయిస్తే విద్యారంగానికి కేవలం రూ.21వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల డీఏలు, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. అంతకుముందు ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శంగా నిలువాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంత్‌రావు, సురేశ్, ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్, సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చవాన్, గోపీకృష్ణ, డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


డైట్ వైస్ ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, సంఘ బాధ్యులు